వసతుల బస్‌స్టేషన్

- బందరు బస్టాండ్‌కు మహర్దశ
- రూ.4.20 కోట్లతో ఆధునికీకరణ
- శరవేగంగా జరుగుతున్న పనులు


అధునాతన హంగులతో నిర్మించిన టాయిలెట్లు


బస్టాండ్‌లో నిర్మించిన నూతన భవనం

మచిలీపట్నంటౌన్: జీవితంలో ఇబ్బందులు పడేవారిని 'నీ బతుకు బందరు బస్టాండే' అని అంటుంటారు. పల్లపు ప్రాంతంలో చిన్నపాటి వర్షానికే చెరువును తలపించేలా ఈ బస్టాండ్ మారుతుంది. ఈ బస్టాండ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా పనిచేస్తున్న సమయంలో బస్టాండ్ అభివృద్ధికి నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరగా రూ.4.20 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో బస్టాండ్ రూపురేఖలు మార్చే అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు ఇక్కడ లభించనున్నాయి.

రూ.3.4 కోట్లతో అభివృద్ధి పనులు

బందరు బస్టాండ్ అభివృద్ధి పనులు దశలవారీగా జరుగుతున్నాయి. కొన్ని పనులు ఇప్పటికే పూర్తి కాగా మరి కొన్ని పనులు కొనసాగుతున్నాయి. బస్టాండ్ మొత్తం ఎలివేషన్, టైల్స్, రంగులతో ముస్తాబు చేయనున్నారు. పల్లంగా ఉన్న ప్లాట్‌ఫారాలను మెరక చేసే పనులు పూర్తి చేశారు. పురుషుల, మహిళలకు వేరువేరుగా లాంజ్ రూమ్‌లు, కార్గో, క్యాంటీన్ నిర్వహణకు ప్రత్యేక విభాగాల భవనాలు ఏర్పాటు చేయనున్నారు. అధునాతన హంగులతో టాయిలెట్లు నిర్మాణం పూర్తి చేశారు. బస్టాండ్ లోపల ఐదు దుకాణాలను నిర్మించారు. ఎంక్వైరీ, బుకింగ్ కౌంటర్, కంట్రోలర్, ట్రాఫిక్ కార్యాలయాలు నిర్మించనున్నారు.


నిర్మాణ పనులు జరుగుతున్న డిస్పెన్సరీ భవనం

రూ.80 లక్షలతో డిస్పెన్సరీ

ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్య సేవలకుగానూ నూతన భవనాన్ని రూ.80 లక్షలతో నిర్మిస్తున్నారు. ఈ పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రస్తుతం రేకుల భవనంలో డిస్పెన్సరీ కొనసాగుతోంది. ఈ డిస్పెన్సరీ పల్లంలో ఉండి శిథిలావస్థకు చేరి సేవలు అందించేందుకు ఇబ్బందిగా ఉంటోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పేర్ని నాని కృషితో డిస్పెన్సరీకి రూ.80 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులు బస్టాండ్ ఆవరణలో శరవేగంగా సాగుతున్నాయి. ఈ భవనం అందుబాటులోకి వస్తే పలు వైద్యవిభాగాలు ఏర్పాటు చేసి ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులకు మెరుగైన సేవలు అందనున్నాయి.

మెరుగైన వసతులు



మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్, డిస్పెన్సరీ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. అధునాతన హంగులతో ఈ పనులు నిర్వహిస్తున్నాం. ఈ పనులు పూర్తయితే ఇటు ప్రయాణికులకు అటు ఉద్యోగులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి. గతంలో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోవటంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులను అధిగమించేలా పనులు జరుగుతున్నాయి.

– టి.పెద్దిరాజు, డిపో మేనేజర్

వేదఘోషతో పులకించిన కోడూరు

- వైభవోపేతంగా సాగిన మహాచండీ యాగం
- మహాపూర్ణాహుతిలో అశేషంగా పాల్గొన్న భక్తజనం
- ఆరు వేల మందికి అన్నసమారాధన

కోడూరు: వేదఘోషతో కోడూరు గ్రామం పులకించింది. గ్రామంలో కొలువైన గంగాభవానీ అమ్మవారి 12వ పునఃప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన మహాచండియాగంలో భక్తజనం అశేషంగా పాల్గొన్నారు. ఉదయం చిన్నఅమ్మవారి విగ్రహానికి కలశపూజలు, పుష్పాభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు, ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మతో పాటు మరో 15మంది దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి చండీ యాగాన్ని జరిపించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది వేదపండితులు యాగక్రతువును నిర్వహించి, 13 కథలను భక్తులకు వివరించారు. చండీయాగాన్ని నిర్వహించడం వల్ల లోకం సుభిక్షంగా ఉండడంతో పాటు రైతులు పాడి పంటలతో సమృద్ధి చెందుతారని పండితులు అనుగ్రహభాషణ చేశారు. దివిసీమలోని ఆరు మండలాలకు చెందిన భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసింది.


ప్రత్యేక అలంకారంలో గంగాభవానీ అమ్మవారు

మహాపూర్ణాహుతితో పరవశించిన భక్తజనం

ఉభయదాతలు డప్పువాయిద్యాల నడుమ మహాపూర్ణాహుతి సామగ్రిని ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం గర్భాలయంలోని గంగాభవానీ అమ్మవారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణ నడుమ మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా జరపగా, తిలకించిన భక్తులు పరవశించారు. హోమంలో నవధాన్యాలు వేసి తమ భక్తిభావం చాటుకున్నారు. అమ్మవారి మూలమూర్తికి వివిధ రకాల పుష్పాలతో చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. త్రిశూలధారిణిగా దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు ఆరు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీ నేతలు చండీయాగంలో పాల్గొని పూజలు చేశారు. ధర్మకర్త కోట యుగంధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పూర్ణాహుతి సామగ్రిని ఊరేగిస్తున్న ఉభయదాతలు


మహా చండీ యాగంలో పాల్గొన్న దంపతులు

కోడూరులో 350మందికి వైద్యపరీక్షలు

కోడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మరింత మెరుగైన వైద్యం అందుతుందని సర్పంచి వెన్నా షైనీ అన్నారు. కోడూరు–1 సచివాలయ పరిధిలో మంగళవారం సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో సర్పంచి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ ప్రజాఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్, సురక్ష, 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి సూచించారు. శిబిరంలో కంటి, పిల్లల, జనరల్ వైద్యనిపుణులు 350 మందికి వైద్యసేవలు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఎంపీటీసీ సభ్యులు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు చేయించుకొనేందుకు వచ్చిన గ్రామ ప్రజలు

నేడు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట


లేళ్లగరువులో పునర్నిర్మించిన రామాలయం


ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు: మండలంలోని లేళ్లగరువు గ్రామంలో చేపట్టి రామాలయం పునఃనిర్మాణ పనులు పూర్తయ్యాయి. బుధవారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరగనుంది. గతంలో ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో పునఃనిర్మాణ పనులు చేపట్టారు. దాతల సహకారంతో సుమారు రూ.కోటితో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. వేద పండితుడు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.08 గంటలకు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఇప్పటికే సిద్ధంగా ఉన్న శ్రీ సీతారాముల విగ్రహాలతో పాటుగా లక్ష్మణ, హనుమాన్, గణపతి, దత్తాత్రేయ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవతామూర్తుల ప్రతిష్ఠను పురస్కరించుకుని మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భక్తబృందం తెలిపింది.

క్లుప్తంగా

రేపటి నుంచి శ్రీరామ వైభవోత్సవాలు

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): గ్రామంలోని భక్తసమాజం, శ్రీగాయత్రీ సేవా ట్రస్ట్ (నల్లూరు– రేపల్లె) ఆధ్వర్యంలో గురువారం నుంచి మార్చి రెండో తేదీ వరకు శ్రీరామ వైభవోత్సవాలు జరుగుతాయని నిర్వాహక కమిటీ ప్రతినిధులు సబ్బనేని పద్మజ, తలశిల నాగలక్ష్మి మంగళవారం తెలిపారు. రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 41 రోజుల వేడుకను పురస్కరించుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. గురువారం విఘ్నేశ్వరపూజ, దీపారాధన, పుణ్యాహవచనం తదుపరి సహస్ర లడ్డూక పూజ, మార్చి ఒకటో తేదీన వేంకటరాముడికి అభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర దీపోత్సవం, రెండో తేదీన పుష్పయాగం, నాగాయలంక సంకర్షణ భజన సమాజం, రేపల్లెకు చెందిన మహాలక్ష్మి భక్త సమాజం సభ్యులతో విశేష భజనలు జరుగుతాయని వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు జగనన్న సురక్ష వైద్యశిబిరాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 15, 45 డివిజన్లలో బుధవారం జగనన్న సురక్ష వైద్యశిబిరాలు జరుగుతాయని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ డివిజన్‌లోని ముత్యాలమ్మగుడి వద్ద ఉన్న మునిసిపల్ పాఠశాలలో, 45వ డివిజన్‌లోని శిశు విద్యామందిరం సచివాలయం వద్ద వైద్యశిబిరాలు నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు ఇస్తారని పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు 28వ డివిజన్ ఇనుగుదురుపేట జెండా సెంటరు సమీపంలో, 36వ డివిజన్ రాజుపేట పిండాలదొడ్డి వద్ద నిర్మించనున్న కమ్యూనిటీ హాళ్లకు శంకుస్థాపన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

క్రమ శిక్షణతో చదువుకోవాలి



మోపిదేవి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రిన్సిపాల్ కె.వీరరవి సూచించారు. మోపిదేవి గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి పాఠశాల, కళాశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీరరవి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు సాహిత్యంపై అవగాహన ఉండాలని, క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. తొలుత పాఠశాల, కళాశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పీఎంసీ చైర్మన్ నాయుడు డేవిడ్, కరుణశ్రీ, కె.వి.సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెడన మునిసిపల్ కమిషనర్‌గా వెంకటరామయ్య



పెడన: స్థానిక పురపాలక సంఘ కమిషనర్‌గా బి.వెంకటరామయ్య బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ప్రస్తుతం వెంకటగిరి పురపాలక సంఘ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పెడన కమిషనర్ మహేంద్ర అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ప్రస్తుతం మునిసిపల్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం వెంకటరామయ్యను బదిలీ చేసింది. త్వరలో వెంకటరామయ్య స్వీకరించనున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెడన: మండలంలోని చేవేంద్ర గ్రామానికి చెందిన కోన జితేంద్ర మారుతి(37) సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని పెడన పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నంలోని ఒక పెట్రోల్ బంకులో మారుతి పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వెళ్లిన మారుతి ఇంటికి రాలేదు. బంధువుల ఇండ్ల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పెడన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మారుతి బావ పసుపులేటి ప్రకాష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ టి.సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతు కుటుంబానికి ఆర్థికసాయం



చల్లపల్లి: సీఎం వైఎస్ జగన్ బాటలో రైతులకు అండగా నిలుస్తున్నట్లు చల్లపల్లి పీఏసీఎస్ చైర్ పర్సన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) తెలిపారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ వద్ద రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన మహిళా రైతు, సొసైటీ సభ్యత్వం, రుణం కలిగిన అన్నపరెడ్డి జయలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె మట్టి ఖర్చుల నిమిత్తం పీఏసీఎస్ సంఘ సభ్యుల సంక్షేమ నిధి, కేడీసీసీ బ్యాంక్ జిల్లా శాఖ ఆర్థిక సహాయం కలిపి రూ.20 వేలను జయలక్ష్మి కుటుంబ సభ్యులకు చైర్ పర్సన్ ఫణి అందజేశారు. సొసైటీ సీఈఓ తోట కృష్ణారావు, పర్సన్లు వేముల ఏడుకొండలు, కొలుసు సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంయూడీఏ అభివృద్ధికి సహకరించండి

- అక్రమ లేఅవుట్లపై చర్యలు
- ముడా వీసీ వెంకటరమణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంయూడీఏ వీసీ వెంకటరమణ

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) అభివృద్ధికి సహకరించాలని సంస్థ వైస్‌చైర్మన్ పి.వెంకటరమణ కోరారు. ముడా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం లైసెన్స్‌డ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఎంయూడీఏ పరిధిలోని 13 మండలాల్లో ప్రజలు తమ ఆస్తులకు సంబంధించి నిర్మాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంయూడీఏ పరిధిలో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వారు తప్పనిసరిగా ఫీజులు చెల్లించేలా లైసెన్స్‌డ్ సర్వేయర్లు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంయూడీఏ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తే ఆ నిధుల ద్వారా ఈ ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. అక్రమంగా లేఅవుట్లను ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి వారిని గుర్తిస్తున్నామని, త్వరలో నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. లోపభూయిష్టంగా అనుమతులు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని ఈ విషయాలపై వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనుమతుల్లో ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్‌రావు, ఎంయూడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ



గూడూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2022–23 ఆర్థిక సంవత్సరం గూడూరు మండలంలో చేపట్టిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సోషల్ ఆడిట్‌కు డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీడీ పి.రామ్మోహన్‌రావు, ఎంపీడీఓ ప్రేమా స్వితి సమక్షంలో విజిలెన్స్ అధికారులు సామాజిక తనిఖీలో గ్రామాల వారిగా జరిగిన పనులపై నివేదికలు సమర్పించారు. ఈ నెల 15 నుంచి 26 వరకు గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు పీడీ సూర్యనారాయణ తెలిపారు. మండలంలో మొత్తం రూ.9,40,87,000 విలువైన పనులు జరిగాయని పేర్కొన్నారు. జరిగిన పనుల్లో జరిగిన చిన్నపాటి తప్పిదాల వల్ల రూ.26,469 రికవరీకి ఆదేశించినట్లు వెల్లడించారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కొనసాగింది.

వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ

గూడూరు: మండలంలోని రాయవరంలోని వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు నందం రవి కిరణ్ ఈ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న ఆరోగ్య శ్రీ చికిత్స పరిమితిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. తద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా విలువైన వైద్యం ఉచితంగా పొందే అవకాశం నిరుపేదలకు దక్కిందన్నారు. గ్రామంలో 926 కుటుంబాలకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ ఉప్పలపు రాఘవయ్య, సీహెచ్‌ఓ బి.శ్రావణి, ఏఎన్‌ఎం జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న బాలకృష్ణ, రవికిరణ్

ఘనంగా ముగిసిన నాంచారమ్మ ఉత్సవాలు

లక్ష్మీపురం(చల్లపల్లి): గ్రామంలో వేంచేసిన శ్రీ బాలా త్రిపుర సుందరీ సహిత శ్రీలక్ష్మీ నాంచారమ్మ తల్లి ఆలయ 92వ వార్షిక ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రధాన అర్చకుడు స్వర్ణ శివ, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమ పూజలు జరిపించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ పెద్దలు దాలిపర్తి నారాయణరావు, మోదుమూడి కుటుంబరావు, గ్రామ ప్రముఖులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

కోడూరు: మండలంలో నిర్మించిన రెండు సచివాలయాలు, రెండు వెల్‌నెస్ సెంటర్లు, ఒక ఆర్బీకే కేంద్ర భవనాలను బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కోడూరు–2, కోడూరు–3 సచివాలయాలు, కోడూరు–1, కోడూరు–3 వెల్‌నెస్ సెంటర్లు, కోడూరు–2 ఆర్బీకే కేంద్రాలను ఉదయం పది గంటలకు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని చెప్పారు. రామకృష్ణాపురంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కూడా రమేష్ బాబు ప్రారంభిస్తారని ప్రకటించారు. అన్ని శాఖలాధికారులు ఈ కార్యక్రమాల్లో విధిగా పాల్గొవాలని ఎంపీడీఓ ఆదేశించారు.

నాగేశ్వరస్వామికి రూ.5.05 లక్షల ఆదాయం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారికి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 16 నెలలకు రూ.5,05,916 ఆదాయం వచ్చిందని ఏసీ ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు. మచిలీపట్నం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ సమక్షంలో మంగళవారం ఉదయం కానుకలను లెక్కించగా నగదుతో పాటు 96 గ్రాముల వెండి, గ్రాము బంగారం సమకూరింది.




భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట పూజలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేటలో శ్రీ సీతాసమేత హరికోదండ రామాలయం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 28వ తేదీ ఉదయం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్న నేపథ్యంలో పూజలు జరిపించారు. ఆలయం పక్కన ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు హోమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 9.53 గంటలకు జరిగే శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి, సరస్వతి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు పాల్గొంటారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతిష్ఠా మహోత్సవానికి నగర ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఈఓ సుబ్రహ్మణ్యంనకు సత్కారం



కోడూరు: మండల కేంద్రమైన కోడూరు పంచాయతీ ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యంను గంగాభవానీ అమ్మవారి ఆలయ కమిటీ మంగళవారం ఘనంగా సత్కరించింది. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య లోపించకుండా సుబ్రహ్మణ్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ధర్మకర్త కోట యుగంధరరావు కొనియాడారు. శానిటేషన్ పనులను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు అన్ని రకాల సేవలందిసుతన్నారని ప్రశంసించారు. సుబ్రహ్మణ్యంను సత్కరించి, చిత్రపటాన్ని బహూకరించారు. కార్యదర్శులు తాతారావు, సుధీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థలం స్వాధీనం అడ్డగింత

బంటుమిల్లి: గ్రామంలోని ఓ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు మంగళవారం ప్రయత్నించగా అందులో ఉంటున్న మూడు కుటుంబాల వారు అడ్డుకున్నారు. సర్వే నంబరు 160లో 13 సెంట్లు స్థలం 40 ఏళ్లుగా శ్రీకాకుళపు బేబిసరోజిని కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉంది. అందులో ఇటుకలు, కుండలు తయారు చేస్తూ వారు జీవిస్తున్నారు. జగనన్న కాలనీ కోసం రెండేళ్ల క్రితం అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయగా బేబిసరోజిని కుటుంబ సభ్యులు తమ వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ దఖలు అగ్రిమెంట్ చూపించారు. ఆ అగ్రిమెంటు చెల్లదని, స్థలంలో ఉన్న మూడు కుటుంబాలకు మూడు ప్లాట్లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో లే అవుట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దౌర్జన్యంగా స్థలాన్ని స్వాధీనం చేసుకుంటే ఆత్మహత్య చేసుకుంటామని పెట్రోలు, పురుగుమందులతో బేబి సరోజిని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని డీటీ రామశివ తెలిపారు.